ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608




సంపుటి: 2 | సంచిక: 284 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 20 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# మహా కుంభమేళాలో అగ్నిప్రమాదం

**ప్రయాగ్‌రాజ్ జనవరి 19 (ప్రభాత ఉదయం):** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో ఫైర్ యాక్సిడెంట్ జరిగింది. కుంభమేళాలోని ఓ శిబిరంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి భారీగా వ్యాపించాయి. మంటలు ఎగసిపడుతుండటం వల్ల భక్తులు భయాందోళనలకు గురయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘటన స్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో ఆదివారం సాయంత్రం సెక్టార్ 19 క్యాంప్‌సైట్ ప్రాంతంలో రెండు మూడు సిలిండర్లు పేలడంతో భారీ అగ్నిప్రమాదం సంభవించిందని అధికారులు తెలిపారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా వేదిక వద్ద ఇప్పటికే నిలిపి ఉంచిన అనేక అగ్నిమాపక యంత్రాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. స్థానిక అధికారులు, పోలీసులు, అగ్నిమాపక శాఖల సమన్వయంతో వెంటనే ప్రయత్నాలు ప్రారంభించి, స్వల్ప వ్యవధిలో విజయవంతంగా మంటలను ఆర్పారు. ప్రాథమిక నివేదికల ప్రకారం, క్యాంప్ సైట్‌లో మంటలు చెలరేగాయి, ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అనేక గుడారాలను మంటల్ని చుట్టుముట్టాయి. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం కూడా సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంలో అగ్నిమాపక సిబ్బందికి సహాయం చేసింది. అనేక గుడారాలు మంటల్లో బూడిదయ్య చుట్టుపక్కల గుడారాల్లో నివసిస్తున్న ప్రజలను భద్రత కోసం ఖాళీ చేయించినట్లు అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం జరగలేదని.. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. మహా కుంభ్ 2025 అధికారిక X హ్యాండిల్ ఘటనపై పోస్ట్ చేసింది, "చాలా విచారకరం! ఌమహాకుంభ్ వద్ద జరిగిన అగ్నిప్రమాదం ప్రతి ఒక్కరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. పరిపాలన యంత్రాంగం తక్షణ సహాయ, రెస్క్యూ ఆపరేషన్‌లను అందిస్తోంది. ప్రతి ఒక్కరి భద్రత కోసం మేము గంగను ప్రార్థిస్తున్నాము" అని రాసుకొచ్చింది. ఇదిలావుండగా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంఘటన స్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ప్రత్యక్ష సాక్షులను, అధికారులను అడిగి ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకున్నారు. అగ్నిప్రమాదానికి గురైన వారికి సహాయం అందించాలని సీనియర్ అధికారులకు సూచించారు.





# రూ.450 కోట్లతో ఐటీ పార్క్

## హైదరాబాద్‌కు పెట్టుబడుల పంట
## రూ.450 కోట్లతో విశ్వనగరంలో ఐటీ పార్క్ నిర్మాణం
## క్యాపిటల్ ల్యాండ్ గ్రూప్ ప్రతినిధులతో సీఎం రేవంత్ బృందం భేటీ



**హైదరాబాద్, జనవరి 19 (ప్రభాత ఉదయం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్ పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లో రూ.450 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు క్యాపిటల్ ల్యాండ్ సంస్థ ముందుకొచ్చింది. సీఎం సారథ్యంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్‌లో మూడో రోజు పర్యటిస్తోంది. అందులో భాగంగా క్యాపిటల్ ల్యాండ్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సహా రాష్ట్ర బృందం సమావేశమైంది. అనంతరం పెట్టుబడులకు ముందుకొచ్చినట్లు క్యాపిటల్ ల్యాండ్ ప్రకటించింది. ఈ మేరకు సంస్థ హైదరాబాద్‌లో రూ.450 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దాంతో నగరంలో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ పార్క్‌ను క్యాపిటల్ ల్యాండ్ నిర్మించనుంది. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, బ్లూ-చిప్ కంపెనీల డిమాండ్‌కు అనుగుణంగా ఈ కొత్త ప్రాజెక్టును చేపట్టనుంది. హైదరాబాద్‌లోని ప్రముఖ బిజినెస్ పార్కులైన ఇంటర్నేషనల్ టెక్ పార్క్ హైదరాబాద్, ఎవ్యాన్స్ హైదరాబాద్, సైబర్ పెరల్ వంటివి క్యాపిటల్ ల్యాండ్ నిర్మించినవే. వ్యాపార వృద్ధిలో హైదరాబాద్ దూసుకెళ్తోంది : హైదరాబాద్‌లో ఈ ఏడాది అందుబాటులోకి తెచ్చే విధంగా 25 మెగా వాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ఇప్పటికే క్యాపిటల్ ల్యాండ్ ప్రకటించింది. ఇంటర్నేషనల్ టెక్ పార్క్ హైదరాబాద్ రెండో దశ నిర్మాణాన్ని ఈ ఏడాది ప్రారంభించి 2028కి పూర్తి చేసేలా ప్రణాళిక చేస్తోంది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ప్రగతి శీల విధానాలతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యాపార వృద్ధిలో హైదరాబాద్ దూసుకెళ్తోందని క్యాపిటల్ ల్యాండ్ ప్రతినిధులు తెలిపారు. బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ నిర్ణయం ఒక మైలురాయి కానుందని వివరించారు.

## ఐక్యత, సమానత్వం అసాధారణ సంగమంగా
# కుంభ మేళా
## ప్రధాని నరేంద్ర మోదీ



**న్యూఢిల్లీ, జనవరి 19 (ప్రభాత ఉదయం):** మహాకుంభ మేళా ఐక్యత, సమానత్వం అసాధారణ సంగమంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయంలో ఎక్కడా వివక్షత, కులతత్వం లేదన్నారు. ప్రధాని ఆదివారం 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో ప్రసంగించారు. మహాకుంభ మేళాలో యువత పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. యువతరం ఆచార వ్యవహారాలను తెలుసుకున్నప్పుడే మన మూలాలు బలపడుతాయన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రపంచ దేశాల నుంచి వస్తున్న ఆదరణ భారతీయులకు గర్వకారణమన్నారు. మహాకుంభ మేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిందన్న ప్రధాని.. అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందన్నారు. ఈ సందర్భంగా జనవరి 25న జరుపుకునే జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ప్రస్తావించారు. ఈ రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైందని.. ఈ సంవత్సరం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతుందని తెలిపారు. పవిత్రమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగ పరిషత్‌లోని గొప్ప వ్యక్తులకు తలవంచి నమస్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి.. పటిష్ఠం చేస్తుందన్నారు. ప్రజాశక్తిని బలోపేతం చేయడానికి సాంకేతికతను ఉపయోగిస్తూ.. నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తుందని కొనియాడారు. అలాగే, అయోధ్య రామమందిరం వార్షికోత్సవంపై వ్యాఖ్యానించారు. వాస్తవానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి నెలా చివరి ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రసంగిస్తారు. ఈ నెల చివరి ఆదివారం రోజున రిపబ్లిక్ డే నేపథ్యంలో మూడో ఆదివారం రోజున మన్ కీ బాత్ 118వ ఎపిసోడ్ ప్రసారమైంది.

## అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి
# రేషన్ కార్డు: భట్టి విక్రమార్క

**ఖమ్మం జనవరి 19 (ప్రభాత ఉదయం):** రేషన్ కార్డులకు ఇంకా ఎలాంటి లిస్ట్ తయారు కాలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఏ లిస్ట్ అయినా గ్రామాల్లోనే తయారవుతుందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. జనవరి 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి

..మిగతా 2లో




# 'భారత రాజ్యంతో పోరాటం'

## రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కేసు నమోదు

**న్యూఢిల్లీ జనవరి 19 (ప్రభాత ఉదయం):** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై మరో కేసు నమోదైంది. 'భారత రాజ్యంతో పోరాటం' అని ఆయన వ్యాఖ్యానించడంపై అస్సాం రాజధాని గౌహతికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దేశంలో అశాంతి, వేర్పాటువాద భావాలను రాహుల్ గాంధీ రేకిస్తున్నారని ఆరోపించాడు. ఈ నేపథ్యంలో పలు సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదైంది. జనవరి 15న ఢిల్లీలోని కోట్లా రోడ్డులో కాంగ్రెస్ పార్టీ కొత్త ప్రధాన కార్యాలయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా

..మిగతా 2లో






సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ డి కె స్నిగ్ధ రెడ్డి

## రాష్ట్రంలో తొలి మహిళా కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలుగా డాక్టర్ డి కె స్నిగ్ధ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 19(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జోగులాంబ గద్వాల జిల్లా ఎస్ వి ఈవెంట్ హాల్ లో కబడ్డీ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించడం జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మహేందర్ రెడ్డి ఆల్ ఇండియా ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జగదీశ్వర్ యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కబడ్డీ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ గా డీకే అరుణ ఎంపీ (మహబూబ్ నగర్),పాట్రన్ గా వెంకటేశ్వర్ రెడ్డి ,అధ్యక్షులు: డి కె స్నిగ్ధ రెడ్డి ,చైర్మన్ గా డి.అబ్రహం,సెక్రటరీ గా నరసింహ, ట్రెజరర్ గా చందు రాములు. లీగల్ అడ్వైజర్ గాటి తరుణ్ ఉపాధ్యక్షులు గా టి.వెంకటేష్, ఆర్ బీమయ్యా, సి.నర్సింలు , కె గోవిందు,తిరుపతి, కె రాజశేఖర్ ,జాయింట్ సెక్రెటరీ లు గా నాగేష్, శివ, ముని రెడ్డి, కృష్ణ లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ లు గా టి రవి, కే జగదీష్, ఎన్. రజినీకాంత్, ఎన్ రాజేందర్, రాజశేఖర్, కె సురేష్, టి రాము, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా భాష ,కృష్ణ, ఎం .వెంకటన్న ,జి రఘు, జి పర్ష, ఈ. రమేష్ ,సర్వేశ్వర్ రెడ్డి, వీరేష్ గట్టు, గీతారెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి కురుమూర్తి, గౌడ్ ,నాగర్ కర్నూల్ సెక్రెటరీ యాదయ్య గౌడ్, మహబూబ్ నగర్ పిడి బాలరాజు, రిటైర్డ్ పిడి శ్రీనివాసులు, ఫుట్బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండల వెంకటరాములు, జోగులాంబ గద్వాల జిల్లాలోని వివిధ మండలాల సీనియర్ క్రీడాకారులు హాజరయ్యారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డ్, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు: కలెక్టర్ సంతోష్

### సంక్షేమ పథకాల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది



గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 19 (ప్రభాత ఉదయం) జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని, ఇదొక నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. ఆదివారం జారీ చేసిన ప్రకటనలో కలెక్టర్ నూతన రేషన్ కార్డులు జారీ, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాలపై ప్రజలు ఆందోళన చెందకుండా ఉండేందుకు కలెక్టర్ స్పష్టంగా తెలియజేశారు. జిల్లాలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకం అమలు జరిగే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుంది అన్నారు. ప్రస్తుత జాబితాలో పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో, మున్సిపాలిటీలు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరంతరంగ ప్రజా పాలన కేంద్రాలను నిర్వహించి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అందే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రస్తుత జాబితాలో పేర్లు లేని వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకొని వారు కూడా ఈనెల 21 నుండి 24 వరకు జరిగే గ్రామసభలలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పథకాలను అమలు పరచడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.



## శక్తి నగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

### సంక్షేమ సంఘాలతో కాలనీలు మరింత అభివృద్ధి చెందుతాయి.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి,జనవరి 19 (ప్రభాత ఉదయం): కాలనీలు సంక్షేమ సంఘాల తోటే అభివృద్ధి చెందుతాయని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసాపేట్ డివిజన్ శక్తి నగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా కమిటీ సభ్యులు మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ ని శాలువాతో సత్కరించారు. నూతన కమిటీ కాలనీని మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. దానికి అవసరమైన సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, కాలనీ నూతన అధ్యక్షుడు చిరంజీవి, సాయి కృష్ణ, పాండురంగ రెడ్డి, అప్పారావు, శ్రీరామ్, రమేష్, రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు: భట్టి విక్రమార్క

మొదటి పేజీ తరువాయి...

కుటుంబానికి రేషన్ కార్డులు ఇస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలందరి సమక్షంలోనే నిష్పక్షపాతంగా, పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని చెప్పారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎలాంటి షరతులు లేకుండా ఎకరానికి రూ.12 వేలు ఇవ్వబోతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. భూమి లేని నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేలు ఇచ్చామని చెప్పారు. ఈ నెల 26 నుంచి మొదలుకానున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభల్లో నిష్పక్షపాతంగా ఎంపిక చేస్తారని పునరుద్ఘాటించారు.

## అబద్ధాలతో మీ రాజకీయ అవసరం తీరుతుందేమో కానీ..
# రైతుల ఆవేదన తీర్చదు



**హైదరాబాద్, జనవరి 19 (ప్రభాత ఉదయం):** రైతు రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు మరోసారి నిలదీశారు. రైతులందరికీ రుణమాఫీ అయిపోయిందని ప్రచారం చేసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి గారూ.. అధికారుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ చెప్పులరిగేలా రైతులు తిరుగుతున్న దుస్థితి మీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అబద్ధపు ప్రచారం మీ రాజకీయ అవసరం తీరుస్తుందేమో గానీ.. రైతుల ఆవేదన తీర్చదని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ కాలేదంటూ బాధలు చెప్పుకుంటున్న మెదక్ జిల్లా టెక్మల్ మండల రైతుల వివరాలను మీకు పంపిస్తున్నామని తెలిపారు. రుణాలు మాఫీ చేసి ఈ రైతుల కన్నీళ్లు తుడవాలని సూచించారు. ముఖ్యమంత్రి గారూ రుణమాఫీపై మాట నిలుపుకోండి అని హితవుపలికారు. అంతకుముందు ఆదిలాబాద్ జిల్లాలో మరో రైతు ఆత్మహత్య చేసుకోవడంపైనా హరీశ్‌రావు స్పందించారు. ఆదిలాబాద్ జిల్లాలో 24 గంటలు గడవకముందే రుణభారంతో మరో రైతు రాథోడ్ గోకుల్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ పూర్తి చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బ్యాంకుల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల చావులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఉసురు ఎందుకు తీస్తున్నారని నిలదీశారు. రైతుల ఆత్మహత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రైతులకు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని తెలిపారు. వరుసగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యలే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతులు దేశానికి వెన్నెముక అని.. అలాంటి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఇప్పటి వరకు రైతులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఇంత జరుగుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టాడని హరీశ్‌రావు విమర్శించారు. గతంలో రుణమాఫీ కాలేదని అదిలాబాద్ జిల్లా తలమడుగులో నిరసన తెలియజేస్తున్న రైతులను అరెస్టు చేసి, పోలీస్ యాక్ట్ పేరుతో జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కారని విమర్శించారు. రుణమాఫీ జరగకపోవడంతో రైతులు కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ విసిగిపోతున్నారని అన్నారు. ఉన్న భూములు కుదవ పెట్టి అప్పులు తెస్తున్నారని.. ఆ అప్పులు చెల్లించలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ అని మభ్య పెట్టి.. 500 బోనస్ అని మోసం చేసి.. పెట్టుబడి సాయన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ దురవస్థ వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు.ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడలేదన్న విషయం, కాంగ్రెస్ పాలకులు పూర్తిగా మరిచిపోయినట్లున్నారని హరీశ్‌రావు అన్నారు. రైతు సోదరులారా దయచేసి ఆత్మహత్యలు చేసుకోకండి అని విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని.. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా అందరికీ రుణమాఫీ, రైతు భరోసా, అన్ని పంటలకు 500 బోనస్ హామీలు అమలు చేసే దాకా నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

## పేలిన పెట్రోల్ ట్యాంకర్


### 77 మంది దుర్మరణం



**న్యూఢిల్లీ, జనవరి 19 (ప్రభాత ఉదయం):** పశ్చిమ ఆఫ్రికా దేశం నైజీరియాలో ఓ పెట్రోల్ ట్యాంకర్ పేలడంతో 77మంది మరణించారు. సెంట్రల్ నైజీరియాలోని నైజర్‌లో ఉన్న సులేజా ప్రాంతంలో కొంతమంది ఓ ట్యాంకర్ నుంచి మరో ట్యాంకర్‌లోకి జనరేటర్ ఉపయోగించి పెట్రోల్ పంపు చేస్తుండగా పేలుడు జరిగింది. దీంతో పెట్రోల్‌ను పంపు చేస్తున్నవారితోపాటు చుట్టుపక్కన పదుల మీటర్ల దూరంలో ఉన్నవారు కూడా మరణించినట్లు నైజీరియా ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ తెలిపింది. ఈ ప్రమాదంలో మరో 25 మంది గాయపడ్డారని పేర్కొంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. మృతుల్లో చాలామంది గుర్తించలేనంతగా కాలిపోయారని తెలిపింది. సరుకు రవాణాకు సరైన రైల్వే వ్యవస్థ లేకపోవడంతో నైజీరియాలో ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి. రెండు వారాల క్రితం డెల్టా స్టేట్‌లో ఫ్యూయల్ ట్యాంకర్ కోసం జరిగిన అల్లర్లలో ఐదుగురు మరణించారు. అదేవిధంగా గతేడాది అక్టోబర్‌లో పైప్‌లైన్ల నుంచి లీకవుతున్న పెట్రోల్‌ను పట్టుకోవడానికి జనాలు ఎగబడటంతో జరిగిన పేలుళ్లలో సుమారు 153 మంది మృతిచెందారు. నైజీరియాలో ఆర్థిక పరిస్థితులు అంతకంతకూ దిగజారడంతో గత 18 నెలల్లో చమురు ధరలు 400 శాతం పెరిగాయి.

## గంగా నదిలో పడవ బోల్తా

### ముగ్గురు మృతి, నలుగురు గల్లంతు




**పాట్నా జనవరి 19 (ప్రభాత ఉదయం):** గంగా నదిలో పడవ బోల్తా పడింది. ఈ సంఘటనలో ముగ్గురు మరణించారు. మరో నలుగురు గల్లంతయ్యారు. రెస్క్యూ బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. గల్లంతైన వారి కోసం నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. బీహార్‌లోని కతిహార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం 17 మందితో కూడిన పడవ అమ్దాబాద్ ప్రాంతంలోని గోలాఘాట్ సమీపంలో గంగా నదిలో బోల్తా పడి మునిగింది. అప్రమత్తమైన కొందరు ఈదుకుంటూ నది ఒడ్డుకు చేరుకున్నారు. కాగా, పడవ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు, అధికారులు అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. నదిలో పడిన పది మందిని రక్షించారు. ఈ సంఘటనలో ముగ్గురు మరణించినట్లు అధికారులు తెలిపారు. ఇద్దరు మృతులను 60 ఏళ్ల పవన్ కుమార్, 70 ఏళ్ల సుధీర్ మండల్‌గా గుర్తించినట్లు చెప్పారు. మరణించిన మరో వ్యక్తిని ఇంకా గుర్తించలేదన్నారు. మరోవైపు పడవ బోల్తాపడిన ఘటనలో నలుగురు వ్యక్తులు గంగా నదిలో గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. వారి కోసం సహాయక, గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పడవలో ఎక్కువ మంది ప్రయాణించడం వల్లనే బోల్తా పడి మునిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. పడవ ప్రమాదంపై దర్యాప్తునకు ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ మనేష్ కుమార్ మీనా వెల్లడించారు.

## 'భారత రాజ్యంతో పోరాటం'

మొదటి పేజీ తరువాయి...

రాహుల్ గాంధీ మాట్లాడారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రతి సంస్థను స్వాధీనం చేసుకున్నాయి. మేం ఇప్పుడు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తోపాటు భారత రాజ్యంతో పోరాడుతున్నాం' అని అన్నారు. కాగా, రాహుల్ గాంధీ అన్న ఈ వ్యాఖ్యలపై పెద్ద దుమారం చెలరేగింది. అస్సాం రాజధాని గౌహతికి చెందిన మోంజిత్ చెటియా దీనిపై ఫిర్యాదు చేశాడు. రాహుల్ గాంధీ తన వ్యాఖ్యలతో దేశంలో అశాంతి, వేర్పాటువాద భావాలను రేకెత్తిస్తున్నారని ఆరోపించాడు. శాంతి భద్రతలు, జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో గౌహతిలోని పాన్ బజార్ పోలీస్ స్టేషన్‌లో రాహుల్ గాంధీపై కేసు నమోదైంది. దేశ సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతను ప్రమాదంలో పడేసే చర్యలకు ఆయన పాల్పడినట్లు అందులో ఆరోపించారు. రాహుల్ గాంధీపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.



## రైతులు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు గురించి మాట్లాడే నైతిక హక్కు నీకెక్కడది

### మీ పది సంవత్సరల పరిపాలనలో ఒక్క రేషన్ కార్డ్ అయిన ఇచ్చారా...?
### ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించడమే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి,జనవరి 19 (ప్రభాత ఉదయం): మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలను టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తీవ్రంగా ఖండించారు. గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యం శ్రీరంగం మాట్లాడుతూ రైతులు, రేషన్ కార్డుల గురించి మాట్లాడే నైతిక హక్కు హరీష్ రావు నీకెక్కడది. మీ పది సంవత్సరల పరిపాలనలో ఒక్క రేషన్ కార్డ్ అయిన ఇచ్చారా హరీష్ రావు. ఇందిరమ్మ ప్రభుత్వం అర్హుడైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డ్ ఇస్తామన్నారు అయిన సిగ్గు లేకుండా నోటికి ఏది వస్తే అది మాట్లుడుతున్నారు. ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు, రైతులు, ఉద్యోగాల భర్తీ విషయంలో హరీష్ రావు కి, కేటీర్ కి ఈ బిఆర్ఎస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఇందిరమ్మ ఇళ్ళు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణి వంటి పథకాల్లో ప్రజా ప్రభుత్వంలో చేస్తున్నటువంటి ప్రజా పాలన అభివృద్ధి పనులను ప్రజల సంక్షేమ పథకాలను గడప గడప కు తీసుకెళ్లుతున్నామన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరంకుశ పాలన నుండి కాంగ్రెస్ ప్రజాస్వామ్య పాలన కొనసాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో పేద, బడుగు, బలహీన వర్గాలన్నింటికీ రేవంత్ రెడ్డి సర్కార్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలకు కట్టుబడి ఉందని, దశల వారీగా వాటి అమలు ప్రక్రియను చేపడుతోందని తెలిపారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500కు వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఓవైపు గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఏడు లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కడుతూనే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 22 లక్షల మంది రైతులకు 18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కుతుందన్నారు.

# ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసుకోవచ్చు అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి

### అదే డిమాండ్ తో ఫిబ్రవరి 7న నగరంలో లక్ష డప్పులు వెయ్యి గొంతులు కార్యక్రమం విజయవంతం చేయాలంటున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


మంద కృష్ణ మాదిగ


డప్పులతో కదం తొక్కుతున్న మాదిగలు

రాజేంద్రనగర్/బుద్వేల్, జనవరి 19(ప్రభాత ఉదయం): సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఎస్సీ రిజర్వేషన్లను ఏబిసిడిలుగా వర్గీకరించవచ్చని రాష్ట్రాలకు అధికారం ఇవ్వడంతో తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లను ఏ బి సి డి లు గా వర్గీకరించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ కోరారు. ఇదే విషయమై ఈ డిమాండ్ తోనే ఫిబ్రవరి 7వ తేదీన నగరంలో లక్ష డబ్బులు వెయ్యి గొంతు లు అనే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అంతలోపు ఎస్సీ రిజర్వేషన్లను ఏబిసిడిలుగా వర్గీకరిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసి గ్రీన్ సిగ్నల్ ఇస్తే విజయోత్సవాలు జరుపుకుంటామని, లేదంటే ప్రభుత్వంపై దండోరా వేస్తామని హెచ్చరించారు. రాజ్యాంగ పరిధిలో ఉన్న న్యాయ వ్యవస్థ ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలన్నారు . 30 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎస్సీ రిజర్వేషన్లను 59 ఉపకులాలకు సమానంగా పంచాలని డిమాండ్ చేస్తూ వర్గీకరణ కోసం ఉద్యమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా 2001 నుంచి 2004 వరకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలు చేశారన్నారు. అయితే కొందరు కోర్టుకు వెళ్లడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించడం చెల్లదని సుప్రీం కోర్టు అప్పట్లో తీర్పు ఇచ్చిందన్నారు. అదే డిమాండ్ తో 20 సంవత్సరాలుగా పోరాడి సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనంతో కూడిన బెంచ్ ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీ లుగా వర్గీకరించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగిస్తూ తీర్పు ఇచ్చిందన్నారు. దానిని వెంటనే అమలు చేయాలని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు.

**ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలుపుతున్నారు :**

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఎస్సీ ఉప కులాల్లోని 58 కులాలతో పాటు, బీసీ, ఓసి వర్గాలు మద్దతు తెలుపుతున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. బీసీ రిజర్వేషన్లను ఏ విధంగానైతే ఏబిసిడిలుగా విభజించి అమలు చేస్తున్నారో అదే రీతిగా ఎస్సీ రిజర్వేషన్లను ఏబిసిడిలుగా అమలు చేస్తే తప్పేంటని ప్రతి ఒక్కరు చెబుతున్నారని గుర్తు చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అడ్డు చెబుతున్న వారిని మనువాదులుగా గుర్తిస్తున్నామని ఆయన పేర్కొన్నారు . స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి ఎస్సీ రిజర్వేషన్లను అనుభవిస్తున్న ఒకే కులం వారైనా మాలలు రిజర్వేషన్లకు అడ్డుగా నిలిచారన్నారు. వారిని తాము మనువాదులుగానే భావిస్తున్నామన్నారు.

**రంగారెడ్డి జిల్లా తో పాటు జీహెచ్ఎంసి పరిధిలో ఉన్న ప్రజలు పెద్ద సంఖ్యలో నగరానికి తగిలి రావాలి :**

ఫిబ్రవరి 7వ తేదీన నగరంలో ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల మద్దతుతో నిర్వహించనున్న లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి రంగారెడ్డి జిల్లా లో ఉన్న ప్రజలతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ప్రజలు ముఖ్యంగా మాదిగలు, మాదిగ ఉప కులాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు.


ఉదంగడ్డ రైల్వే బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

## ఉదంగడ్డ రైల్వే బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి: సీపీఎం

బుద్వేల్, జనవరి 19(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ మండలం మైలార్దేవ్ పల్లి డివిజన్ ఊడం గడ్డ రైల్వే స్టేషన్ నూతన బ్రిడ్జి దగ్గర సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వెంకటయ్య అధ్యక్షతన ఆదివారం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్ర కుమార్ హాజరై మాట్లాడుతూ, రాజేంద్రనగర్ మండల పరిధిలో ఉన్నటువంటి మైలార్దేవ్ పల్లి డివిజన్ ఊడం గడ్డ రైల్వే స్టేషన్ దగ్గర నిర్మిస్తున్నటువంటి ఫ్లైఓవర్ దాదాపు నాలుగు సంవత్సరాల కాలం కిందట కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని చెప్పి బ్రిడ్జి సంబంధించి అడ్డుగా ఉన్నాయని ఇళ్లను చుట్టుపక్కల కూలగొట్టి రోడ్డును వెడల్పు చేయడం జరిగిందన్నారు . ఈ బ్రిడ్జి మైలార్దేవ్ పల్లి నుండి శాస్త్రి పురం వట్టే పల్లి కి వెళ్లే దారిలో నిర్మిస్తున్నారన్నారు. ఆ దారి మూసి వేయడంతో అక్కడున్నటువంటి ప్రజలు మెయిన్ రోడ్డుకు రావాలంటే మొత్తం రౌండ్ తిరిగి వచ్చేసరికి నాలుగు నుండి ఐదు కిలోమీటర్లు అవుతుందన్నారు . ఈ బస్తీలలో నిత్యం కార్మికులు మిడిల్ క్లాస్ ప్రజలు చిరు వ్యాపారస్తులు బాద పడుతున్నారన్నారు. ఇట్టి విషయాన్ని వారందరూ పలుమార్లు సిపిఎం పార్టీ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. రాజేంద్రనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆ బ్రిడ్జిని సందర్శించి ధర్నా కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. ఈ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేసేలా హైదారాబాద్ ఎంపీ అసద్దిద్దీన్ ఓవైసీ, చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి. ప్రకాష్ గౌడ్, ఈ డివిజన్ ల కార్పొరేటర్లు వెంటనే సందర్శించి ప్రభుత్వ అధికారులతో, కాంట్రాక్టర్లతో చర్చించి వెంటనే పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు ఎన్ జంగయ్య, బచ్చలకూర స్వామి, జీఎం చైతన్య మైలార్ దేవపల్లి ప్రజలు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసు, భీమయ్య, చాంద్ పాషా, ఇమ్రాన్ , జహంగీర్, తదితరులు పాల్గొన్నారు


రైతు భరోసా ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

## వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్త కోట, జనవరి 19(ప్రభాత ఉదయం )వ్యవసాయ యోగ్యమైన భూమి కలిగిన రైతులకు రైతు భరోసా లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, వ్యవసాయ యోగ్యం కానీ భూములను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం అర్హుల ఎంపిక కోసం జరుగుతున్న సర్వే విషయమై ఆదివారం కొత్తకోట మున్సిపాలిటీ కార్యాలయంలో కలెక్టర్ మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలోని దండుగడ్డ ప్రాంతంలో వ్యవసాయ యోగ్యం కానీ భూములను, ఇప్పటికే లే అవుట్లుగా మారిన భూములను తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ... అర్హులైన, నిజమైన రైతులకు రైతు భరోసా లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా వ్యవసాయ యోగ్యం కానీ భూములను లే అవుట్లు, ఇళ్ళు నిర్మించుకున్న భూములు, భూసేకరణ చేసిన భూములను గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సర్వే నెంబర్ల ఆధారంగా సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి ఇప్పటికే వ్యవసాయానికి యోగ్యం కాని భూములను గుర్తింపు ప్రక్రియ ముమ్మరం చేయాలని సూచించారు. తహసిల్దార్, వ్యవసాయాధికారులు, మున్సిపల్ కమిషనర్ సమన్వయం చేసుకుంటూ వ్యవసాయ యోగ్యం లేని భూములను గుర్తించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి పూర్తయిన సర్వే ఆధారంగా జాబితా సూపర్ చెక్ చేసి నిజమైన అద్దె దారులు ఎవరు, నిజమైన అర్హులు ఎవరు అనేది పక్కాగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జడ్పి డిప్యూటీ సిఈఓ రామమహేశ్వర్, తహసిల్దార్ వెంకటేష్, ఎంపీడీవో చెన్నమ్మ, మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీ వేమన భగవాన్ జయంతి

కొత్తకోట, జనవరి 19(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో శ్రీ వేమన భగవాన్ జయంతి వేడుకల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా సిడిసి మాజీ చైర్మన్ బీసం చెన్నకేశవ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు పసుపుల నెహ్రూ, నాగేష్, వహిద్, శ్రీను, వేమన భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు కిస్మత్‌పూర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

బండ్లగూడ, జనవరి19(ప్రభాత ఉదయం) కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ లో వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. రాక్ చర్చి ఫీడర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు శ్రీ సాయి కాలనీ, ప్రభుత్వ పాఠశాల, రాఘవేంద్ర కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్ ఆర్ ఐ టౌన్‌షిప్, రాధా రియాలిటీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓం నగర్ కాలనీ, ఎస్ ఎం ఎన్‌క్లేవ్ 1 %డ% 2, సి ఎల్ విల్లాస్, పూజా విల్లాస్, రాక్ చర్చి, కృతి విల్లాస్ ప్రాంతాలలో నిర్వహణ , చెట్ల కొమ్మలను తొలగించడానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

# క్యాన్సర్ వస్తే ఆందోళన చెందొద్దు

### ధైర్యమే చికిత్సకు ఉపయోగపడుతుంది
### క్యాన్సర్ అవగాహన సదస్సు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

బుద్వేల్, జనవరి 19(ప్రభాత ఉదయం): క్యాన్సర్ బారిన పడినవారు ఆందోళన చెందకుండా ధైర్యంతో చికిత్స చేయించుకుంటే తగ్గుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. ఎలాంటి వ్యాధులకు అయినా ధైర్యమే సగం బలమని ఆయన పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పద్మశాలిపురం లోని మార్కండేయ భవన్లో కిమ్స్ ఆసుపత్రి ఆంకాలజీ విభాగం అధిపతి మధు దేవరశెట్టి ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.... ఇటీవల కాలంలో చాలామంది యువత మద్యం అధికంగా సేవిస్తున్నారని అన్నారు. అధికమద్యం సేవించడం, సిగిరెట్లు తాగడం, గుట్కాలు తినడం ఇలాంటి అలవాట్లు అన్ని క్యాన్సర్ కారకాలని వైద్యులు చెబుతున్న పెడచెవిన పెడుతున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం వ్యాయామాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. అయితే ఎంత జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అప్పుడప్పుడు వ్యక్తులకు వ్యాధులు ప్రబలడం సహజమేనని చెప్పారు. అలాంటి సమయంలో అనవసర ఆందోళన చెందకుండా ధైర్యంతో తగిన చికిత్స చేయించుకోవాలన్నారు. ఎంతటి వ్యాధినైనా ధైర్యంతో ఎదుర్కోవచ్చుని, సగం చికిత్సల పనిచేస్తుందని వివరించారు. కిమ్స్ ఆసుపత్రి క్యాన్సర్ వైద్య నిపుణులు మధు దేవరశెట్టి మాట్లాడుతూ... సరైన అవగాహన లేక చాలామంది క్యాన్సర్ బారినపడుతున్నారన్నారు. జీవనశైలిలో చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా క్యాన్సర్ దరిచేరకుండా జీవించొచ్చు అన్నారు. హైదరాబాద్ నగరం ఎలాంటి క్యాన్సర్లు నైనా తగ్గించే అధునాతన వైద్యం అందుబాటులో ఉందన్నారు. ఒకప్పుడు క్యాన్సర్ కు ఆందోళన చెందేవారని ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు. అయితే క్యాన్సర్ బారిన పడిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే, దరిచేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా కిమ్స్ వైద్యులు స్థానికులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం డాక్టర్ అన్వర్ అహ్మద్, డాక్టర్ కార్తీక్, ధనుంజయ్, గంజి వెంకటేష్, సరికొండ వెంకటేష్, మన్న వెంకటేష్, టి ప్రేమ్ గౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బుద్వేల్‌లో బోనాల ఉత్సవాలు


ఈదమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు


బుద్వేల్ ఈదమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

బుద్వేల్, జనవరి19(ప్రభాత ఉదయం): బుద్వేల్ రజక బస్తీలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ తర్వాత వచ్చే మొదటి ఆదివారం నాడు బోనాల ఉత్సవాలు నిర్వహించడం బుద్వేల్ రజక బస్తీలో అనవాయితీగా వస్తుంది. అందులో బాగంగా నిర్వహించిన బోనాల ఉత్సవాలు, జాతర లో బుద్వేల్ కు చెందిన వందలాది మంది మహిళలు, పురుషులు పాల్గొన్నారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుద్వేల్ రజక సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో బోనాల ఉత్సవాలలో పాల్గొన్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా స్థానిక నాయకులు పెం డ్యాల శ్రీధర్, పెండ్యాల సాయి మల్లిక్, పెండ్యాల రేణుక, శిష ప్రదీప్, పెండ్యాల వినోద్ కుమార్, రాజు, సన్నీరాజ్, సాయి కిరణ్ లు ఈదమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


పల్లకి మోస్తున్న నాయకులు

## కొత్తకోటలో ఘనంగా వేమన జయంతి

కొత్తకోట, జనవరి 19(ప్రభాత ఉదయం) కొత్తకోట మండల కేంద్రంలో ఆదివారం రాఘవేంద్ర దేవాలయం దగ్గర యోగివేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. రెడ్డి జేఏసీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొత్తకోట పురవీధుల్లో పల్లకి సేవతో ఊరేగింపు నిర్వహించారు. యోగివేమన తన పద్యాల ద్వారా సమాజంలోని రుగ్మతలను పద్యంలో తూర్పార బట్టి సామాజిక చైతన్యానికి అక్షరాన్ని నిలిపి ప్రజల ముందుంచి అజ్ఞానాన్ని పటాపంచలు చేసి ప్రజల హృదయాలకు పద్యాలతో అలరించి స్పష్టమైన భాషలో సూటిగా సత్యాన్ని వెలిబుచ్చి శక్తివంతమైన మాట జనహృదయాలలో దిష్టివేసి సామ్యవాదాన్ని చాటి చెప్పిన ప్రజాకవి అని తెలియజేస్తున్నారు. రాష్ట్ర రెడ్డి జేఏసీ నాయకుడు పైల హరినాథరెడ్డి, మధుకర్ రెడ్డి, నాగ్యా నాయక్, సి డి సి చైర్మన్ గొల్ల బాబు, మాజీ సిడిసి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి,వేముల శ్రీనివాస్ రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, రావుల కర్ణాకర్ రెడ్డి, బూత్కూర్ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, నాగిరెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, పురుషోత్తం శెట్టి, గోకరయ్య, తదితరులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఊరేగింపు సాగించారు.



పదోన్నతి పొందిన సాయి కిరణ్ గౌడ్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

## అధికారులు ప్రజలకు మరింత చేరువతో సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్, జనవరి 19(ప్రభాత ఉదయం): అధికారులు ప్రజలకు మరింత చేరువతో పనిచేసే సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కోరారు . ఆదివారం నాగారం జలమండలి మేనేజర్ గా పదోన్నతి పొందిన సందర్భంగా ఈ సాయికిరణ్ గౌడ్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా పెంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి సాయి కిరణ్ గౌడ్ కు శుభాకాంక్షలు తెలిపారు. సాయి కిరణ్ గౌడ్ విధినిర్వాణలో ప్రజా సమస్యలు పరిష్కరించుటలో చురుగ్గా పనిచేశారని అభినందించారు.



శంషాబాద్‌లో డప్పులు వాయిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## వేయి గొంతులు-లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

శంషాబాద్, జనవరి 19 (ప్రభాత ఉదయం): ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీ లుగా వర్గీకరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం తీర్పు ఇవ్వడంతో తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీ లుగా వర్గీకరించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మదిలేటి మాదిగ కోరారు. ఇదే డిమాండ్ తో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7 న నగరంలో లక్ష డప్పులు వెయ్యి గొంతులు అనే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనవరి 28 న సన్నాహక సదస్సు ను చేపడుతున్నట్లు తెలిపారు. అందులో బాగంగా ఆదివారం శంషాబాద్ మండల ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం మండల ఇన్చార్జి రాచమల్లు చిట్టిబాబు మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో గ్రామ,గ్రామం లో మాదిగ, మాదిగ ఉపకులను ఐక్యపరచి గ్రామానికి 20 డప్పులు తగ్గకుండా మండలానికి 500 డప్పులతో పాటు ప్రజలను తరలిచుకోవాలని కార్యాచరణ ప్రణాళిక రూపొందిచుకొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ మద్దిలేటి మాదిగ , రాష్ట్ర నాయకులు కె . రమేష్, ఎం. రత్నం, ఆర్ యస్ రమేష్ మున్సిపల్ కన్వీనర్ ఆర్ .రాజు, నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు



కోత్వాల్ గూడ మల్లన్న స్వామి జాతరలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజల సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**కోత్వాలు గూడలో వైభవంగా మల్లన్న జాతర**
**పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, కౌన్సిలర్ లక్ష్మీ శ్రీనివాస్ గౌడ్**

శంషాబాద్, జనవరి 19( ప్రభాత ఉదయం) శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని కోత్వాల్ గూడ లొ మల్లన్న జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా జరిగే జాతర ఉత్సవాలలో భాగంగా జరిగిన మల్లన్న జాతర, కళ్యాణోత్సవంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు . కోత్వాల్ గూడతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పగడాల లక్ష్మీ శ్రీనివాస్ గౌడ్. మాజీ జడ్పిటిసి నీరటి తన్వి రాజు ముదిరాజ్, మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, నార్సింగ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు మేకల వెంకటేష్ ముదిరాజ్, సంజయ్ యాదవ్, తోకల మురళి యాదవ్, పోతుగంటి దయానంద్ , గ్రామ ప్రముఖులు రామచంద్ర యాదవ్, అల్వాల్ అంజయ్య, కర్ణం జ్ఞానేశ్వర్ యాదవ్, నరేందర్ యాదవ్, రాజు యాదవ్, గుర్రంపల్లి శ్రీనివాస్ యాదవ్,కర్ణం జగదీశ్వర్ యాదవ్, పగడాల సిద్దేశ్వర గౌడ్, లింగమయ్య యాదవ్, లింగం యాదవ్, బాబుల్ యాదవ్, గుర్రంపల్లి కృష్ణ యాదవ్ ,కర్ణం శ్రీనివాస్ యాదవ్, కొత్త కాపు రాజిరెడ్డి , ప్రవీణ్ యాదవ్, మహేష్ యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం రాష్ట్ర మహాసభలకు
# భారీ సంఖ్యలో తరలి రావాలి

**సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ .. బహిరంగ సభను జయప్రదం చేయండి**




సిపిఎం మహాసభల పోస్టర్ విడుదల చేస్తున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 19(ప్రభాత ఉదయం)భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు(సిపిఎం)రాష్ట్ర నాలుగవ మహాసభల సందర్భంగా 25 వ తేదీన నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం ధరూర్ మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్ వద్ద మహాసభల గోడ పత్రికలను, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్ర భవిష్యత్తు కోసం సకల జనుల సంక్షేమ కోసం జరిగే సిపిఎం రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపు ఇచ్చారు. వివక్ష అంటరానితనం అసమానతలు లేని సమాజం కోసం నిరంతరం పోరాడుతూ అణగారిన జాతుల పక్షాన నికరబద్ధంగా నిలబడి పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సిపిఎం మాత్రమేనని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య వైద్యం అందాలని రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని భూమి లేని పేదలందరికీ భూమి పంపిణీ చేయాలని బహుజనులకు జనాభా ప్రాతిపాదిక నిధులను కేటాయించి వారి సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేస్తూ ప్రణాళికబద్ధంగా ఉద్యమాలను చేస్తున్న సిపిఎం పార్టీకి అండగా నిలబడాలని కోరారు. ఈ మహాసభలకు సిపిఎం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకారత్, బీవీ రాఘవులు సహా రాష్ట్ర నాయకత్వం హాజరవుతారని అన్నారు 25 నుండి 28 వరకు 4 రోజుల పాటు మహాసభలు జరుగుతాయని ఈ మహాసభలలో గత పోరాటాలను సమీక్షించి భవిష్యత్ పోరాటాలకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. 25వ తేదీన ఐబీ నుండి ప్రజా ప్రదర్శన ప్రారంభమై సంగారెడ్డి పట్టణ పురవీధులలో ప్రజా ప్రదర్శన చేస్తూ పీఎస్ఆర్ గ్రౌండ్ లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు. ఈ బహిరంగ సభకు జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని,మహాసభల నిర్వహణ కోసం ప్రజలు తమ హార్థిక ఆర్థిక సహకారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దేవదాసు, మేకల నరసింహులు, మోష, తిమ్మప్ప, ప్రవీణ్, వినయ్, నరసింహ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

### నారాయణ యాదవుకు
## నివాళులు అర్పించిన గ్రామస్తులు



శంషాబాద్, జనవరి 19( ప్రభాత ఉదయం): శంషాబాద్ మండల పరిధిలోని హమిదుల్లా నగర్ గ్రామ మాజీ కోఆప్షన్ సభ్యుడు కాసారం రాజు తండ్రి కాసారం నారాయణ యాదవ్ దశదినకర్మ ఆదివారం నిర్వహించారు. హమీదుల్లా నగర్ లో జరిగిన దశదినకర్మ కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులతో పాటు గ్రామ ప్రముఖులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వట్టెల సతీష్ యాదవ్. కాసారం రాజు యాదవ్. సంగీత, మహేందర్ యాదవ్, శ్వేత బుచ్చమ్మ. నరసింహ యాదవ్, అనిల్ యాదవ్, అపర్ణ, మధు యాదవ్, పవన్ యాదవ్ లడ్డు యాదవ్, అర్చన. సాయికిరణ్ తో పాటు వెంకటేష్ యాదవ్, శేఖర్ యాదవ్, సురేందర్ యాదవ్, నాగేష్ యాదవ్, సతీష్ యాదవ్, రమేష్ యాదవ్, కుమార్ యాదవ్, భాస్కర్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు కాసారం రాజు యాదవ్ కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.



## చిన్నారిని ఆశీర్వదించిన నాయకులు

కొత్తకోట, జనవరి 19(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన సునీత మనీవర్ధన్ రెడ్డి కుమార్తె పుట్టు చీర కార్యక్రమం ఆనంద్ కన్వెన్షన్ లో జరిగింది. ఈ కార్యక్రమం లో ఉమ్మడి పాలమూరు జిల్లా సిడిసి మాజీ చైర్మన్ చెన్నకేశవ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నరోత్తం రెడ్డి , రావుల గోపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నాగరాజు, రవీందర్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.



## అల్విన్ కాలనీ డివిజన్‌లో బిజెపి జెండా ఎగరేయ్యడం ఖాయం

**బిజెపి రాష్ట్ర నాయకులు రవీందర్ రావు, డాక్టర్ నరేష్**

కూకట్‌పల్లి, జనవరి 19 (ప్రభాత ఉదయం) వచ్చే కార్పొరేటర్ ఎన్నికలలో ఆల్విన్ కాలనీ డివిజన్‌లో బిజెపి జెండా ఎగరవేయడం ఖాయమని బిజెపి రాష్ట్ర నాయకులు రవీందర్ రావు, డాక్టర్ నరేష్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, అల్విన్ కాలనీ డివిజన్ పటేల్ కుంట పార్క్ ఎదురుగ ఉన్న బిజెపి కార్యాలయంలో అల్విన్ కాలనీ డివిజన్ నూతన అధ్యక్షులుగా ఎత్తరి రమేష్ పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ లు పాల్గొని రమేష్ కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు, కేశవరావు, మణిభూషణ్, స్రవంతి, నర్సింగ్ యాదవ్ లు కూడా శాలువాతో సత్కారించి శుభాకాంక్షలు తెలపారు. ఈ కార్యక్రమంలో దుర్గ ప్రసాద్, శ్రీహరి యాదవ్, అరుణ్, నవీన్ గౌడ్, వంశీ రెడ్డి, నర్సింగ్, లలిత రెడ్డి, సురేష్, చాంద్,అనూష, తదితరులు పాల్గొన్నారు.



## కోకాపేట్ భూములను అమ్మింది బిఆర్ఎస్ ప్రభుత్వం కాదా?

**కూకట్‌పల్లి ఎమ్మెల్యేవి గురివింద గింజ మాటలు**
**కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు యుగంధర్ రెడ్డి**

కూకట్‌పల్లి,జనవరి 19 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో ఎంతో ఆనందంగా జీవిస్తుంటే, ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. సంవత్సరం క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బేకార్ పార్టీ అని కాంగ్రెస్ పార్టీ బెస్ట్ పార్టీ అని ప్రజలే తీర్పును ఇచ్చి అధికార సీటులో రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి సీటులో కూర్చో బెడితే కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడంలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ పాలసీ ప్రకారం ప్రభుత్వం ముందుకు నడుస్తుందని మీరు చెబితే నడుస్తుందా...బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు భూములను అమ్మలేదా? అని ప్రశ్నించారు. కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురివింద గింజ సామెతలు చెబుతున్నాడు అని తీవ్రంగా విమర్శించారు. కోకపేట భూములను ఎవరు అమ్మారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కదా? ఈ విషయం కూకట్ పల్లి ఎమ్మెల్యేకు తెలియదా? అని అన్నారు. అన్నీ తెలుసుకుని మాటాడితే బాగుంటుందని, మైక్ దొరకగానే మాట్లాడటం సరికాదని అన్నారు. టెండర్ ద్వారా దక్కించుకున్న భూముల్లో ఇండ్లు కట్టుకొనివ్వమని ఒక ఎమ్మెల్యే మీడియా ద్వారా బహిరంగంగా ప్రజలను బెదిరిస్తున్నాడు, ఇదెక్కడి న్యాయం అని అన్నారు.

### షాద్ నగర్ నుంచి మామిడిపల్లి వరకు
# ఆర్టీసీ బస్సును నడపండి

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సిఫార్సు లేఖను షాద్ నగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ కు అందచేసిన ఆప్పారెడ్డి గూడ గ్రామస్తులు**



షాద్ నగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాసిన సిఫార్సు లేఖను అందచేస్తున్న ఆప్పారెడ్డి గూడ నాయకులు

ఆప్పారెడ్డి గూడ, జనవరి 19(ప్రభాత ఉదయం): షాద్ నగర్ బస్ డిపో నుండి మామిడిపల్లి కు గతంలో ఉన్న విధంగా బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఆప్పారెడ్డి గూడ గ్రామ నాయకులు కోరారు. ఉదయం సాయంత్రం వేళలో తప్పకుండా ఆర్టీసీ బస్సు సేవలు అందించాలన్నారు . షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బస్సు సర్వీసు లను పునరుద్ధరించాలని రాసిన లేఖ ను ఆదివారం ఆప్పారెడ్డి గూడ మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ సీతారాం తదితరులు డిపో మేనేజర్ ను కలిసి అందజేశారు. షాద్ నగర్ నుండి మామిడిపల్లికి అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, చెర్ల అంతిరెడ్డిగూడ, మొదళ్లగూడ, మసీదు మామిడిపల్లి, గుడి మామిడిపల్లి, మామిడిపల్లి మీదుగా ఉదయం, సాయంత్రం వరకు బస్సు సర్వీసులను కొనసాగించాలని లేఖలో ప్రస్తావించారు. అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, చెర్ల అంతిరెడ్డిగూడ, మొదళ్లగూడ, మసీదు మామిడిపల్లి, గుడి మామిడిపల్లి గ్రామాల మీదుగా షాద్నగర్ నుండి మామిడిపల్లికి వెళ్లే బస్సు సర్వీసులను పునః ప్రారంభించాలని మీ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నామన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608